రాగం: చారుకేశి

తాళం: ఆది

దాచుకో నీపాదాలకు దగనే జేసిన పూజలివి
పూచి నీకీరితిరూపపుష్పము లివి యయ్యా

1. వొక్కసంకీర్తనే చాలు వొద్దికై మమ్ము రక్షించగ
తక్కినవి భండారాన దాచి వుండనీ
వెక్కసమగునీనామము వెలసులభము ఫలమధికము
దిక్కై నన్నేలితి విక నవి తీరనినాధనమయ్యా

2. నానాలికపైనుండి నానాసంకీర్తనలు
పూని నాచే నిన్ను బొగడించితివి
వేనామాలవెన్నుడా వినుతించ నెంతవాడ
కానిమ్మని నా కీపుణ్యము గట్టితి వింతేలయ్యా

౩. ఈమాట గర్వము గాదు నీమహిమే కొనియాడితినిగాని
చేముంచి నాస్వాతంత్ర్యము చెప్పినవాడగాను
నేమాన బాడేవాడను నేరము లెంచకుమీ
శ్రీమాధవ నే నీదాసుడ శ్రీవేంకటేశుడవయ్యా